


# ఫారిన్ వెళ్ళాల(న)ండి

## - వసుంధర



***మనం ఎంత ఆధునికమైనా, చరిత్రకున్న విలువ మరువలేనిది. అలానే ఈ రోజుల్లో ఎప్పుడు కావాలంటే అప్పుడు ఎక్కడికైనా వెళ్ళగలిగే సౌకర్యాలు( డబ్బులుంటే చాలు) ఉన్నాయి కానీ కొన్ని దశాబ్దాల క్రిందట (1970 దశకం ప్రారంభంలో) ఇలాంటి ప్రయాణాల వెనుకనున్న సాధకబాధకాలు తెలుసుకోవడం ఇప్పటికీ ఆసక్తికరంగా ఉంటుంది. -సం.***

*(గత సంచిక తరువాయి)*

1974–75 వాతావరణంలో అప్పటి పశ్చిమజర్మనీ దేశం ఈ రచనలోని సన్నివేశాలకు వేదిక. ఆ సన్నివేశాలను వివరించినది – అప్పటి వాతావరణంలో సంప్రదాయబద్ధంగా పెరిగి, ఆధునికతని అవగాహన చేసుకుంటున్న ఓ మధ్యతరగతి భారతీయుడు. వృత్తిరీత్యా సైంటిస్టు.

అప్పటికి ఇండియాలో టివిలు కొన్ని మహానగరాలకే పరిమితం. టెలిఫోన్లు వ్యాపారస్థులకీ, భాగ్యవంతులకీ, ఉన్నతోద్యోగులకే అందుబాటు. కంప్యూటర్లది పాశ్చాత్యదేశాల్లోనూ పెద్ద గదిని కేటాయించాల్సినంత పరిమాణం. మొబైల్సు, ఇంటర్నెట్ వగైరాలు వాడుకలోకొస్తాయన్న ఊహ కూడా లేదు.

ఇండియాలో ఇప్పుడు గ్రామాలకున్న సదుపాయాలు, అప్పుడు మహానగరాలకే లేవు. ఆ నేపథ్యాన్ని స్మరించి – రచయితతోపాటు పాఠకులూ 1974లో పయనించి – చదవడం మొదలెడితే – ఈ రచనలోని చాలా విశేషాలు మరింత రసానుభూతినిస్తాయి. ఐతే 2016–17లోనూ – ‘మనం ఎక్కణ్ణించి ఎక్కడికొచ్చాం? ఎక్కడికి పోతున్నాం?’ అనే భావనను కలిగించి ఆలోచింపజెయ్యగలిగితే, ఈ రచన సార్థకమౌతుంది.

అంశాల పరంగా ఇది రెండు భాగాల రచన. మొదటిది ల్యానబర్గులో ‘పీజీ టు కేజీ’ గత మాసంలో ముగిసింది. ఇప్పుడు రెండవది ‘బెర్లిన్ ద్వీపే డాయిచ్ ఖండే’లో తొలివిడతగా ‘ఫన్ నేనొక్కడినే’. ఇందులో అంశాల్ని జరిగిన వరుస క్రమంలో కాక – పాఠకులకు అనువుగా ఉండేందుకు ఉపశీర్షికల్లో వివరించడం జరిగింది.

రసానుభూతితోపాటు, ప్రయోజనాత్మకమూ కావాలన్న మా తపన అక్షరరూపం దాల్చడానికి స్ఫూర్తినిచ్చిన కౌముదికి హృదయపూర్వకంగా ధన్యవాదాలు తెలుపుకుంటూ, రచనలోకి అడుగెడుతున్నాం.

# రెండవ భాగం: బెర్లిన్ ద్వీపే డొయిచ్ ఖండే

ఇండియాలో ప్రభుత్వోద్యోగిని. ఇక్కడ జర్మనీలో నీడపట్టున ఉంటూ ప్రభుత్వమిచ్చే స్కాలర్‌షిప్‌తో కడుపులో చల్ల కదలకుండా రోజులు గడుపుతున్నాను నేను. అనుక్షణం భయంభయంగా జీవితం గడుపుతున్నాడు దాస్. అతను నాకు సాయపడతాట్ట.

ఆత్మవిశ్వాసానికి ఇంతకంటే గొప్ప ఉదాహరణ ఉంటుందా?

దాస్‌ని చూసేక, అతని మాటలు విన్నాక – చాలా విషయాల్లో నా దృక్పథం మారింది.

నిజం నిజమే. దానికి మంచి, చెడు అనేవి మనసు కల్పించినవే తప్ప వాటికి ఇదమిత్థమనే నిర్వచనం లేదు.

దాస్ రెసిడెన్స్ పెర్మిట్ లేకుండా ఉద్యోగం చేస్తున్నాడన్నది నిజం.

అది చెడ్డ పని. తప్పు. నేరం. సుఖమైన జీవితాన్ని వదిలి ఈ జీవితాన్ని ఎన్నుకోవడం తెలివితక్కువతనం. పై నిజానికి నేను చేర్చిన విశేషణాలివి. వాటిని నా మనసు కల్పించింది.

దాస్‌కి సంబంధించి – అతను ఈ జీవితాన్ని సవాలుగా స్వీకరించాడు. సవాలు లేని జీవితం అతనికి నచ్చదు.

నన్ను తీసుకుంటే – నా భార్యాబిడ్డల్ని ఇక్కడికి రప్పించుకోవడమనే విషయం నాకు సవాలుగా పరిణమించింది. ఆ మాత్రం సవాలుని నేను ఆత్మవిశ్వాసంతో స్వీకరించలేనా?

శ్రీమతిని జర్మనీకి రప్పించాలన్న నా ఆకాంక్ష దాస్ కారణంగా మరింత బలపడింది.

బెర్లిన్లో ఆ హాస్టల్ని నాకు చిరస్మరణీయం చేసింది దాస్ మాత్రమే కాదు. మరెన్నో అనుభవాలున్నాయి.

మరిన్ని హాస్టల్ ముచ్చట్లు

నేను లియోపాల్డ్ ప్లాట్జ్ హాస్టలుకి తరచుగానే వెడుతుండేవాణ్ణి.

అక్కడ ఒక రూంలో ఒక సిరియన్ ఉన్నాడు. అతనికి మూవీ ప్రాజెక్టరుంది. తరచుగా నీలి చిత్రాలు తెచ్చి వాటి ప్రదర్శనకు పదిమందినీ పిలిచేవాడు. నాతో ఆట్టే పరిచయం లేకపోయినా ఒక రోజున నన్నూ బలవంతపెట్టి తన గదికి తీసుకుపోయాడు. అక్కడ తెలిసినవాళ్లు కొందరున్నారు కానీ వాళ్లలో ఓంప్రకాష్ లేడు.

నీలి చిత్రాన్ని ఓ గదిలో అంతమంది మిత్రులమధ్య కూర్చుని చూడ్డం ఓ వింత అనుభవం.

నేను ఫిక్షన్ ప్రియుణ్ణి. ఏ చిత్రం చూసినా ముందు కథకోసం వెదుకుతాను. విశేషమేమిటంటే ఈ నీలి చిత్రంలో కొంచెం కథ ఉంది.

ఒక భర్త భార్యని అనుమానించాడు. తను బయటకు వెడుతున్నట్లు ఆమెను నమ్మించాడు. భార్య ఫోన్ చేసి ప్రియుణ్ణి ఇంటికి రప్పించుకుంది. భర్త వాళ్ల వ్యవహారాన్ని రహస్యంగా గమనిస్తుంటాడు. ప్రియుడామెతో శృంగారం మొదలుపెడతాడు. పచ్చితనం మొదలు. నరాలు తెగిపోయేలా సంగీతం. ఆడది పరవశంతో చేసే హాహాకారాలు. వాటికి మురిసిపోతూ ఉద్రేకపడే పురుషపుంగవుడు. సాధారాణంగా దంపతులమధ్య జరిగే నెలరోజుల భంగిమలు – అక్క డొక గంటలో ప్రదర్శించబడ్డాయి.

భర్త ఇదంతా చూస్తున్నాడు. అతని కళ్లలో కోపం, క్రూరత్వం. అయినా మనలాంటి ప్రేక్షకులకోసం భరించి మొత్తం దృశ్యాలన్నీ ఓపికగా చూస్తాడు. భార్య దుస్తులు తొలగిస్తుంటే అదోలా చూస్తాడు. ఆమె పరవశానికి చలిస్తాడు. ఆ జంట శృంగార చేష్టలకి మథనపడతాడు. ప్రియుడు తన భార్యని అనుభవిస్తుంటే కృంగిపోతాడు. శృంగారం పరాకాష్ఠకు చేరుకుని, ఆ జంట సోలిపోయినప్పుడు ఆ ఇద్దర్నీ కాల్చి చంపి అక్కణ్ణించి వెళ్లిపోతాడు. అదే ముగింపు. అంటే అది విషాదాంత చిత్రం.

ఆ సినిమా చూస్తుంటే – అప్పటికప్పుడు స్త్రీకి ఓ పురుషుడూ, పురుషుడికి ఓ స్త్రీ కావాలనిపిస్తుంది. ఆ సినిమా ప్రభావంనుంచి బయటపడ్డానికి కాసేపు పట్టింది నాకు.

అక్కణ్ణించి ఓంప్రకాష్ గదికి వెళ్లాను. అతను నన్ను చూసి చాలా ఉత్సాహపడ్డాడు. తను రోడ్డుమీంచి తెచ్చుకున్న టివిని బాగు చేసి బొమ్మ వచ్చేలా చేశాడుట. నేను వెళ్లేసరికి టెలివిజన్లో ఓ మంచి కార్యక్రమం వస్తోంది. అందమైన బాతుల జంట కేంద్రంగా ఎన్నో మనోహర ప్రకృతి దృశ్యాల్ని ఇముడ్చుకున్న కార్యక్రమమది. మనసునిండా ఆహ్లాదం పరచుకుంది. మానసిక ప్రశాంతతకి ప్రకృతి దృశ్యాలను మించినదేదీ లేదనిపించింది.

ఒకే దేశం. రెండు విభిన్న కార్యక్రమాలు. రెంటికీ ఎంత భేదం?

ఆ హాస్టల్లో సరదాకబుర్లకి లోటు లేదు.

ఒకసారి నేను హాస్టలుకి వెళ్లగానే కన్నడ రావ్ ఎదురయ్యాడు. అతని క్రాపు కొత్తగా తమాషాగా బాగుంది. ఆ విషయం అతనికి చెప్పి మెచ్చుకున్నాను.

రావ్ సంబరపడలేదు. చిన్నబుచ్చుకుని వెళ్లిపోయాడు.

నావల్ల ఏదో పొరపాటు జరిగిందనిపించింది. ఓంప్రకాష్ రూంకి వెళ్లి జరిగింది చెప్పాను. అంతే, కాసేపతను పడిపడి నవ్వాడు.

రావ్ కథేమిటంటే –

ఒక రోజు ఓంప్రకాష్ గోపాలకృష్ణన్‌కి ట్రిమ్మరు గురించి చెప్పాడు. ట్రిమ్మరు అంటే లోపల బ్లేడులమర్చిన దువ్వెన. దాంతో తల దువ్వుకుంటే, జుట్టు ఎప్పుడూ ఒకే సైజులో ఉంటుంది. చెంపలు మాత్రం పెరుగుతాయి. మంగలి ఖర్చులు ఆదా చేసుకుందుకు అదో ఉపాయం. అలాంటిది బెర్లిన్ వచ్చేముందు నటరాజన్ ట్రయిన్లో కొరియామీద ప్రయోగించాడు. అదే ప్రయోగం ఈ హాస్టల్లో ఓంప్రకాష్ గోపాలకృష్ణన్‌మీద చేశాడు. అంతా ఓంప్రకాష్ ప్రావీణ్యాన్ని మెచ్చుకున్నారు. ఎంతలా అంటే, కన్నడ రావ్ కూడా ఓంప్రకాష్‌కి కస్టమర్ కావాలని ఆత్రపడ్డాడు.

ఓంప్రకాష్ చాలా ఉత్సాహపడ్డాడు. "ఇన్నాళ్లూ ప్రయోగాలు మాత్రమే చేస్తున్నాను. ఈరోజు నాలో ప్రొఫెషనల్‌ని చూస్తావు" అని గర్వంగా ప్రకటించాడు. పక్కరూంనుంచి ఓ రివాల్వింగ్ ఛెయిర్ తెచ్చి రావ్‌ని అందులో కూర్చోబెట్టాడు. అతని చొక్కా కాలరు లోపలకి మడత పెట్టాడు. ఓ తెల్ల గుడ్డని తెచ్చి రావ్ భుజం చుట్టూ కప్పాడు.

"ట్రిమ్మర్ కటింగ్ కదా! కదిలితే అభాసౌతుంది. బుద్ధిగా కూర్చో" అని రావ్‌కి చెప్పి ట్రిమ్మర్ని కుడి చెంపకి ఆనించాడు.

తన్ను తాను ప్రొఫెషనల్‌గా నిరూపించుకోవాలన్న తాపత్రయంలో కాబోలు – అతని ట్రిమ్మరు కొంచెం దారి తప్పింది. రావ్ చెంపల పక్కన ఎక్కడో కొద్దిగా తెగింది. ఉడుకురక్తమేమో – ఎర్రగా పొంగి ఓంప్రకాష్‌నే విభ్రాంతుణ్ణి చేసింది.

కన్నడ రావ్‌కి చురుక్కుమన్న స్పర్శలో మంట తెలిసింది. ఓంప్రకాష్ చూపులా మంటకి ఆజ్యం పోసి అతన్ని భయవిహ్వలుణ్ణి చేశాయి. అప్పుడతనికి మొహమాటం వగైరాలేం తెలియలేదు. అప్రయత్నంగా కెవ్వుమన్నాడు.

కూతలతో, విరుపులతో రాక్ పాటలు పాడుతున్నప్పుడు కూడా ఆశాభోంస్లే కుదురుగా నిలబడి ఉంటుంది. గొంతులో పలికే వణుకులు శరీరంలో ఏమాత్రం స్ఫురించనివ్వదు. అదామెకెలా సాధ్యమో కానీ, అలాంటి పాటలకు కిషోర్ కుమార్ ఐతే గొంతుకంటే ఎక్కువగా మనిషి ఊగిపోతాడు. అదే ఎక్కువ సహజమనిపిస్తుంది.

ట్రిమ్మర్ తాకిడి చురుక్కుమన్నప్పుడు రావ్ అరుపులో రాక్ పాట పలకలేదు కానీ, తనువు మాత్రం కిషోర్‌కిలాగే ఊగిపోయింది. ఆ కదలడంలో ట్రిమ్మర్లో ఇరుక్కున్న అతని జుట్టు అడ్డదిడ్డంగా తెగింది.

ఎలాగో ప్రయత్నించి ట్రిమ్మరునుంచి విడివడి కుర్చీలోంచి చటుక్కున లేచి నిలబడ్డాడు రావ్. అంతే, భుజాన్ని కప్పిన తెల్లగుడ్డ – పైన చిన్న రక్తపు మరకని సింధూరంలా ధరించి కిందకు జారింది.

రావ్ కేక – మకరికి చిక్కిన కరి వేడ్కోలులా – ఆ సౌధంలోని మూల మూల గదుల్ని కూడా చేరింది. ఐనా 'సిరికిం చెప్పకుండా'ఆత్రంగా బయల్దేరే బ్యాచి వాళ్లు ఎందరో ఉండరు కదా! ఓ ఇద్దరు మాత్రం పరుగున ఆ గదిలోకి అడుగెట్టారు. వాళ్లు రావ్‌ని తేరిపార చూసి, విన్న కేక గురించి కూడా మర్చిపోయి, "హెయిర్ స్టయిల్ చాలా బాగుందే, ఏ సెలూన్‌కి వెళ్లావ్?" అన్నారు.

ఓంప్రకాష్ ముఖంలో చిరుగర్వం. అతను కొంచెం ముందుకి వంగి ఆ ఘనకార్యం తనదేనన్నట్లు, "థాంక్స్ ఫర్ ది కాంప్లిమెంట్" అన్నాడు.

అంతవరకూ భయం, ఆక్రోశం నిండిన రావ్ మనసులో ఆశకి కొంచెం చోటు దొరికింది. చప్పున వెళ్లి అక్కడున్న అద్దం ముందు నిలబడ్డాడు.

కొత్త క్రాపుతో కనిపించిన ప్రతిబింబం ఏడుపొక్కటే తక్కువన్నట్లు అతన్ని చూసింది.

రావ్ చలాకీ యువకుడు. ఎప్పుడూ నీటుగా ఉంటాడు. ఫ్యాషన్ విషయంలో చాలా శ్రద్ధ వహిస్తాడు. జుట్టు పొడవుగా పెంచాడు. తరచుగా డిస్కొతేక్‌కి వెళ్లి అమ్మాయిలతో డ్యాన్సులు చేస్తాడు. అతనికో గర్ల్‌ఫ్రెండ్ ఉంది. "ఎలా ఉంది – ఓంప్రకాష్ సెలూన్" అన్నాడు ఓంప్రకాష్ గర్వం మేళవించిన ఉత్సాహంతో.

రావ్ కళ్లు వెంటనే ఆ గదంతా వెదికి ఓ టోపీని కనుగొన్నాయి. అతని కాళ్లు క్షణాలమీద టోపీ దగ్గరకు నడిపించాయి. ఆవెంటనే చేతులు అతని తలని ఆ టోపీలో దాచేశాయి.

"ఎలా ఉంది ఓంప్రకాష్ సెలూన్!" మళ్లీ అడిగాడు ఓంప్రకాష్.

రావ్ బదులివ్వలేదు. మాట్లాడకుండా గదిలోంచి బయటకు వెళ్లాడు. హాస్టల్లోంచి రోడ్డుమీదకి వెళ్లాడు. కనిపించిన సెలూన్లో దూరాడు.

సెలూన్ కాళీగానే ఉంది. జర్మన్ మంగలి అతన్ని పరీక్షగా చూసి ఫక్కున నవ్వాడు.

"ఎందుకు నవ్వుతున్నావ్" అడిగాడు రావ్.

"ఇంతవరకూ నాదగ్గరికి ఎవరొచ్చినా క్షౌరానికే వచ్చారు. మొదటిసారిగా జుట్టు మరమ్మతుకొచ్చిన మనిషిని చూస్తున్నాను" అన్నాడు జర్మన్ మంగలి.

అతనికి తన అవసరం అర్థమైందని గ్రహించినవాడై, "థాంక్స్! పరిస్థితి అర్థం చేసుకున్నావ్" అన్నాడు.

జర్మన్ మంగలి అతనికి సారీ చెప్పి, "నేను మరమ్మతులు చెయ్యను" అన్నాడు.

అతనా మాట చాలా ఖచ్చితంగా అన్నట్లు తెలిసినా, "కానీ రెగ్యులర్ కస్టమర్సుకి చెయ్యగలవు, చెయ్యగలవు, చెయ్యగలవు" అన్నాడు రావ్ హిప్నొటైజ్ చేస్తున్నట్లు.

రావ్ కళ్లలోకే చూస్తున్న జర్మన్ మంగలి, హిప్నొటైజ్ కాలేదు కానీ, అతని కళ్లలోని దైన్యానికి కరిగిపోయాడు.

"చేస్తాను కానీ డబుల్ ఛార్జి ఔతుంది" అన్నాడు. రావ్ సరేనన్నాడు. అతను రావ్ పొడవాటి జుట్టుని బాగా కత్తిరించి, పొట్టిగా స్క్రూకట్ చేశాడు.

రావ్ అద్దంలో చూసుకుని, "ఇంతకంటే గుండే నయం" అన్నాడు.

మంగలి వెంటనే, "నీకు గుండు ఇష్టమని ముందే చెబితే డబల్ ఛార్జి అడిగేవాణ్ణా? హాఫ్ ఛార్జికే చేసేవాణ్ణి" అన్నాడు.

ఆ క్రాపు విషయమై రావ్ చాలా దుఃఖంలో ఉన్నాడు. ఎవరు అతన్ని చూసినా ఓసారి క్రాపు విషయం ఎత్తి బాగుందని మెచ్చుకుంటున్నారు. రావ్‌కి అది ఎగతాళిగా అనిపిస్తోంది.

ఆ నేపథ్యం తెలియక నేనా క్రాపుని పొగిడాను. అతనది వేళాకోళమే అనుకున్నాడు. కానీ పొడుగుజుట్టు కంటే ఆ క్రాపే అతనికి బాగా నప్పిందని నిజంగానే నాకనిపించింది. అతను నమ్మే స్థితిలో లేడు.

ఓంప్రకాష్ కథ పూర్తయ్యేసరికి రావ్ ఆ గదిలోకొచ్చాడు.

“నీకు నేను చేసిన క్రాపే బాగుందని రావు అంటున్నాడు” అన్నాడు ఓంప్రకాష్ అతన్ని చూసి.

“నువ్వు ఎంతమందిచేతైనా రికమెండేషన్లు చేయించుకో. నేను నీకు సెలూన్ ఫీల్డులో ఛాన్సు రానివ్వను. నా పాత ఫొటో ఉందిగా – దానిపక్కన ఇప్పటి ఫొటో పెట్టానంటే సరి” అన్నాడు రావ్.

ఓంప్రకాష్ నవ్వి, “ఐతే నేను చేసిన క్రాపుతో ఫొటో తీయించుకుని శాశ్వతంగా దాచుకుంటావన్న మాట!” అన్నాడు.

రావ్ మొహంలో ఇరిటేషన్. “అమ్మో! నోరు జారాను. ఈ క్రాపుతో ఫొటో ఉండడానికి వీల్లేదు. నా జుట్టు ఎదిగేదాకా ఎలాగో టోపీలతో మ్యానేజి చేస్తాను” అన్నాడు.

“క్రాపింగు గురించి ఇంత వర్రీ ఔతున్నావా? ఎలాగూ ఎదిగే జుట్టే కదా, దానికింత రభసెందుకు?” అన్నాను.

“పెళ్లయినవాడివి. నా బాధ నీకు తెలియదు” అన్నాడు రావ్.

“పెళ్లి కాకపోయినా గర్ల్‌ఫ్రెండుందిగా నీకు?” అన్నాను.

“పెళ్లానికీ, గర్ల్‌ఫ్రెండుకీ చాలా తేడా ఉంది. గర్ల్‌ఫ్రెండ్ అవసరం రాత్రిళ్లే గుర్తుకొస్తుంది. పెళ్లాన్నయితే పగలనక, రాత్రినక ఎన్నాళ్లయినా భరించాలి. మనం దేశాలు తిరిగితే తననీ దేశాలు తిప్పాలి” అన్నాడు రావ్. అప్పుడతని గొంతులో అహమ్మద్ వినిపించాడు నాకు.

“నువ్వన్నది నిజమే! నేను నా భార్యనిక్కడికి తీసుకు రావాలనుకుంటున్నాను” అన్నాను.

అంతవరకూ వేరే మూడ్‌లో మాట్లాడుతున్న రావ్ చటుక్కున నాకు షేక్‌హ్యాండిచ్చి, “కాస్త ఆలస్యంగానైనా చాలా మంచి నిర్ణయం తీసుకున్నావు. ఇక్కడ నీకేం భయం లేదు. మేమంతా ఉన్నాం” అన్నాడు.

ఆర్థికంగా బక్కప్రాణిని. చొరవ తక్కువ మనిషిని. స్వంత డబ్బుతో భార్యాబిడ్డల్ని ఇక్కడికి తీసుకురావడమన్నది మామూలు నిర్ణయం కాదు. అడుగు ముందుకు పడుతున్నా మనసంతా భయమే! అలాంటప్పుడు నాకు కావాల్సింది మోరల్ సపోర్ట్.

రావ్ మాటలు నాకు ఉత్సాహాన్నివ్వగా థాంక్స్ చెప్పాను.

అప్పుడు ఓంప్రకాష్ నాకోసం అద్దె ఇల్లు వెదకడంలో తను చెయ్యబోయే ప్రయత్నాల గురించి ప్రస్తావించాడు. ఇక ఆ అవసరం లేదనీ, ఒలోముచ్‌కీ ఇల్లివ్వడానికి ఒప్పుకున్నదనీ చెప్పాను.

ఓంప్రకాష్ ఎగిరి గంతేసినంత పని చేసి, “ఈ బెర్లిన్ మహానగరంలో అత్యంత కష్టమైన పని – ఇల్లు సంపాదించడం. అది సాధించావంటే నువ్వు చాలా అదృష్టవంతుడివి. ఇక నువ్వు ఫిబ్రవరిదాకా ఆగడమెందుకు? వెంటనే నీవాళ్లను రప్పించుకోవచ్చుగా” అన్నాడు.

“ఔను, ఈ ఆలోచన నాకెందుకు రాలేదు?” అనుకున్నాను. కానీ నాకు తెలుసు – ఆ ఆలోచన ఎందుకు రాలేదో!

ఇంకా నవంబరు మధ్యలో ఉన్నాను. ఇండియాలో నావాళ్ల ప్రయాణానికి డబ్బు ఏర్పాట్లు చెయ్యాల్సి ఉంది. అందుకు కాస్త సమయం కావాలి.

ఏదేమైతేనేం, దేశం కాని దేశంలో ఉన్నానన్న భావం నాలో పోయింది. నేను ఒంటరిని కాననీ, ఇక్కడకూడా నా వాళ్లు చాలామందే ఉన్నారనీ ధైర్యమొచ్చింది.

అది చాలు – నేను ప్రయాణ సన్నాహాల జోరు పెంచడానికి!

*ప్లేనుకి వేళాయెరా*

ఇండియానుంచి శ్రీమతి ఉత్తరం వచ్చింది.

మామూలుగా ఐతే తననుంచి ఉత్తరం రాగానే నాలో ఏదో తెలియని ఉత్సాహం కలిగేది. ఉత్తరం విప్పగానే తనే పక్కన కూర్చుని మాట్లాడుతున్నట్లు అనిపించేది. అది మాటలకందని రసానుభూతి.

ఈ ఉత్తరం అలాంటిది కాదు. నేనీ ఉత్తరంకోసం ఆత్రుతగా, భయంగా, బెంగగా ఎదురుచూస్తున్నాను. ఓ జీవన్మరణ సమస్యకు పరిష్కారాన్ని ఇముడ్చుకున్న మహత్తర లేఖ నాకది.

కవరు చింపాలంటే తొట్రుపాటు. అలాగే చింపాను.

చదవాలంటే భయం. అలాగే చదివాను.

ముందుగా మాకు ధనసహాయం అందించగల సత్తా ఉన్న బంధువుల గురించి వ్రాసింది. వాళ్లు చాలామందే ఉన్నారు కానీ అందరికీ ఒక్కుమ్మడిగా ఏవో ఇబ్బందులొచ్చాయిట.

తర్వాత సత్తా లేనివాళ్లు కొందరి గురించి వ్రాసింది. వాళ్లు తెగ బాధ పడిపోయి – 'మాకే సత్తా ఉంటేనా, మా అవసరాలన్నీ పక్కకునెట్టి, మీ అవసరానికి ఆదుకునే అదృష్టం మాకు కలిగిందని మురిసిపోయేవాళ్లం' అని మావాళ్లే ఓదార్చాల్సిన స్థాయిలో ఘొల్లుమన్నారుట. ఎవర్నించైనా మాటలే తప్ప పైసా రాలడం లేదుట.

ఇక మామగారైతే తన పలుకుబడి ఉపయోగించడానికి స్వయంగా రంగంలో దిగేరుట. అప్పు తీసుకుంటాననీ, అదీ బంధువులు కానివారినుంచి మాత్రమేననీ అంటున్నారుట. వడ్డీ ఎంతైనా తనే భరిస్తాననీ, ఎలాగైనా 'మమ సుత' జర్మనీ వెళ్లి తీరాలనీ మరీ మరీ చెబుతున్నారుట.

తన కూతురికి విదేశాలకి వెళ్లే అవకాశమొస్తే, ముఖ్యంగా అప్పట్లో, ఏ తండ్రికైనా కలిగే సంతోషానికి అదుపుండదు. నా మామగారు తన బిడ్డల్ని ప్రాణప్రదంగా ప్రేమించిన వ్యక్తి. పెళ్లి చేసి పంపేసేక కూడా, ఆడపిల్లల ఔన్నత్యానికి తన వంతు బాధ్యత ఉన్నదనుకునే ఆదర్శమాయనది.

శ్రీమతిని నాతోపాటు జర్మనీ పంపడానికి ఆయన ఎప్పుడో చొరవ తీసుకుని ఉండేవారు. దేశం కాని దేశంలో స్కాలర్‌షిప్పుమీద బ్రతికే నేను, అక్కడొచ్చే డబ్బుతో భార్యాబిడ్డల్ని కూడా పోషించగలనా అన్నది ఆయన సందేహం. అది నన్నడిగి తీర్చుకుందామంటే – నామీద మానసికంగా ఒత్తిడి పడుతుందని భయం. నిజానికి ఆదిలో ఐతే నేను నావాళ్లను జర్మనీకి తీసుకెళ్లాలనుకోలేదు.

మామగారి బంధువర్గంలో విదేశాలు వెళ్లినవారు కొందరున్నారు. కానీ వాళ్లు పెళ్లి కాకుండా వెళ్లారు.

నేనిప్పుడు శ్రీమతిని జర్మనీకి తీసుకెళ్లే ఉద్దేశ్యంలో ఉన్నానని తెలియగానే – మామగారి సంతోషానికి పట్టపగ్గాలు లేవు. ఆమె ప్రయాణపు ఖర్చులు ఎలాగో అలా తనైనా భరించాలని అనుకుంటున్నారాయన.

కానీ నాకది ఏకోశానా ఇష్టం లేదు. ఎందుకంటే మన సమాజం తీరుతెన్నులు బాగా తెలుసు నాకు. అక్కడ అల్లుడికిచ్చిన డబ్బు గోడకి వేసిన సున్నంలాంటిది. అడిగి వసూలు చేసుకోలేరు. అల్లుడే తిరిగిస్తానని బలవంతపెట్టినా పుచ్చుకోలేరు.

'నీ మావ బాకీ వసూలు చేశాడా, ఏం కూతురికోసం ఆ మాత్రం చెయ్యలేడా?' అని అల్లుడికి ఎక్కించేవారుంటారు.

'అల్లుడి దగ్గర బాకీ వసూలేమిటోయ్, మరీ అంత డబ్బు కక్కుర్తి పనికిరాదు' అని మామగారిని ఈసడించేవారూ ఉంటారు.

విషయం వాళ్లిద్దరికీ సంబంధించినదే ఐనా – బట్టబయలు కాక తప్పదు. అందుకే మామా అల్లుళ్ల మధ్య ఆర్థికపరమైన లావాదేవీలుండకూడదన్న విషయాన్ని నా ఆదర్శాల జాబితాలో ఎప్పుడో చేర్చేశాను.

మామగారు లక్నోలో లా చదివారు. స్వతహాగా ఆదర్శవాది. ఆపైన లక్నోలో అతల్ బిహారీ వాజపేయి ఆయనకి సీనియర్. ఆయన వ్యక్తిత్వాన్ని ఊహించడం కష్టమేం కాదు.

ఆయన కాకినాడ వచ్చి కొన్నాళ్లు లా ప్రాక్టీసు చేశారు. ఐతే ఆ వృత్తిలో అబద్ధం చెప్పకుండా ఒక్క రోజు కూడా గడవదని నిర్ధారణ అయ్యేక – లా ప్రాక్టీసు మానేసి వ్యవసాయదారుడిగా స్థిరపడాలనుకున్నారు.

ఆదర్శాలు వల్లించడం విషయంలో కమ్యూనిస్టు కాదు కానీ, శ్రమజీవుల్ని అవగాహన చేసుకొనడంలో సామ్యవాది ఆయన. అందువల్ల పేరుకి పెద్ద భూస్వామి ఐనా, చేసే వ్యవసాయంవల్ల ఆయనకంటే ఆయన కింద పనిచేసే రైతులే ఎక్కువ బాగుపడ్డారు.

వైభవాలకి లోటు లేకపోయినా, గత రెండేళ్లుగా ఆయన తాత్కాలిక ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నారని నాకు తెలుసు.

ఈ విషయాలన్నీ అలా ఉంచితే – ఇప్పుడు శ్రీమతి బరువు బాధ్యతలన్నీ పూర్తిగా నావి. తనని జర్మనీ రప్పించుకునే విషయంలో సూచనప్రాయంగానైనా ఆయన జోక్యాన్ని ఆమోదించానంటే, అది 'అల్లుడిగా అవకాశం' తీసుకోవడమే ఔతుంది.

ఐనా ఇండియాలో మనకేమైనా అప్పు పుడుతుందేమోనని నేను భువనేశ్వర్ సహచరుడు సూర్యనారాయణకీ, నా అన్నయ్యకూ మాత్రమే కాక – మామగారికి కూడా ఉత్తరం వ్రాసానంటే – అది లౌక్యం కాదు.

జర్మనీలో ఉన్నంత కాలమూ నా వద్ద ఎన్ని మార్కులుంటే అంత ధైర్యంగా ఉంటుంది నాకు. అంతే కాదు – ఇండియా వెళ్లేక అప్పిచ్చినవాళ్లకి కావాలంటే రూపాయల్లో కాక మార్కుల్లోనే బాకీ తీర్చే అవకాశముంది. దానివల్ల ఓ ప్రయోజనముంది.

అప్పట్లో స్కూటర్లు మార్కెట్లో అంత సులభంగా దొరికేవి కాదు. అందులోనూ బజాజ్ స్కూటర్ ఐతే – ముందు అడ్వాన్స్ కట్టి – కేటాయింపు కోసం ఏళ్లతరబడి ఎదురుచూడాల్సిందే! బజాజ్ స్కూటరుకి ఎంత గిరాకీ అంటే – బ్లాకులో దాని ధర, కోటా ధరకి రెట్టింపుకి పైన ఉండేది. చాలామంది బ్లాకులో అమ్మి సొమ్ము చేసుకుందుకే బజాజ్ స్కూటర్ని బుక్ చేసుకునేవారు. రూపాయల్లో బదులు విదేశీమారకద్రవ్యంతో అడ్వాన్సు కడితే – బజాజ్ స్కూటర్ ఒకటి రెండు నెలల్లోనే కేటాయించబడేలా కోటా ఉంది. అందుకని చాలామంది విదేశాల్లో ఉన్న బంధుమిత్రుల్ని విదేశీమారకద్రవ్యం అడుగుతుండేవారు. అందువల్ల ఇప్పుడు నాకు రూపాయల్లో సాయపడ్డంవల్ల తర్వాత సాయపడ్డవాళ్లకీ కొంత ప్రయోజనం ఉంటుందని నేననుకున్నాను.

పిలిచి పిల్లనిస్తానంటే కులం గోత్రం అడిగారని సామెత ఉండనే ఉందిగా. ఫారిన్ ఎక్స్‌ఛేంజికోసం ముక్కూ మొహం ఎరుగని వాళ్ల వెంటబడ్డానికైనా సిద్ధమేమో కానీ, నా ఫారిన్ ఎక్స్‌ఛేంజి ఆఫర్ మా బంధుమిత్రుల్లో ఎవర్నీ ఆకర్షించలేదు.

ఇవీ శ్రీమతి ఉత్తరంలో ముఖ్యాంశాలు. అవి చదువుతుంటే – నాలో కొత్త అనుభూతులేం లేవు. తను పొందిన అనుభూతుల్ని అక్షరాలుగా మార్చి ఆ ఉత్తరంలో పొదిగిందామె. ఆమె నా అర్ధాంగి. తన అనుభూతులు నా అనుభూతులకు భిన్నంగా ఉండవు.

ఆతర్వాత ఇంటి దగ్గర్నుంచి వచ్చిన మిగతావాళ్ల ఉత్తరాల్లోనూ ఏదీ కూడా డబ్బు ఏర్పాట్ల విషయంలో ఏమాత్రం ప్రోత్సాహకరంగా లేదు.

"పిల్లల్ని తీసుకువెళ్లడం తప్పనిసరి ఐతే అందువల్ల అక్కడ చాలా ఇబ్బందులుంటాయని అనుభవజ్ఞులు అంటున్నారు. ఐనా మీరు ప్రొసీడయ్యే మాటైతే, టికెట్లు ఇండియాలో కొనడం కంటే జర్మనీలో కొని పంపడమే మెరుగుట" ఇది సూర్యనారాయణ ఉత్తరం సారాంశం.

"అమ్మాయికి ట్యూబెక్టమీ ఆపరేషన్ జరిగింది. ఆర్నెల్లవరకూ భార్యాభర్తలు విడిగా ఉంటాలిట. ప్రయాణం ఫిబ్రవరి మధ్యలో జరిగేలా ఏర్పాట్లు చెయ్యడం మంచిది" ఇది మామగారి ఉత్తరం సారాంశం.

"ఇండియానుంచి బెర్లిన్ వెళ్లడానికి – ఒక ఫుల్ టికెట్టు, రెండు హాఫ్‌టికెట్లు కలిపి – మొత్తం పద్నాలుగువేల అయిదొందల రూపాయలు ఔతుంది. నీకు డబ్బు ఏర్పాటవుతుందంటే తెలియజెయ్యి. నీ జవాబు చూసుకుని పాస్‌పోర్టులకి ఏర్పాటు చేస్తాను" ఇది అన్నయ్య ఉత్తరం సారాంశం.

ఈ మూడు ఉత్తరాల సారాంశం నాతోపాటు శ్రీమతినీ చేరినట్లుంది.

"ఎయిర్ టికెట్‌కి వాయిదాల పద్ధతిమీద డబ్బు కట్టొచ్చుట. రానూపోనూ ముప్పైవేలైనా సరే – వెనుకాడద్దు. ఈ ప్రయాణం ఆపొద్దు. నేను ఫిబ్రవరిదాకా ఆగలేను. మిమ్మల్ని విడిచి క్షణం కూడా ఉండలేను. వెంటనే నన్నిక్కణ్ణించి తీసుకుపొండి" అని ఉత్తరం వ్రాసింది.

ఆ ఉత్తరంలోని ఆక్రోశం నాకు ఎలాంటి కిక్ ఇచ్చిందంటే – వెంటనే ఓంప్రకాష్ వద్దకి పరుగెత్తాను.

అతను నేను చెప్పినదంతా విని, "టికెట్ సంగతెలా ఉన్నా, పాస్‌పోర్టు తీసుకోవడానికేం? ఒకోసారి పాస్‌పోర్ట్ రావడానికే నెలలు పట్టేస్తుంది. అర్జంటుగా పాస్‌పోర్ట్ తీసుకోమని మీవాళ్లకి రాయి" అన్నాడు.

నా జేబులో ఏరోగ్రామ్ సిద్ధంగా ఉంది. చకచకా అన్నయ్యకి ఉత్తరం వ్రాస్తున్నాను.

ఈ విషయంలో ఓంప్రకాష్ నాకంటే చురుగ్గా ఉన్నాడు. నేనుత్తరం వ్రాస్తుంటే అతను – 'ఇండియా టూరిస్ట్ సెంటర్'కి చెందిన సరళ్‌సేన్ అనే అతనికి ఫోన్ చేశాడు.

నేను ఉత్తరం వ్రాయడం పూర్తయ్యేసరికి తనకి ఫోన్‌లో సరళ్‌సేన్ ద్వారా తెలిసిన వివరాలు చెప్పాడు ఓంప్రకాష్.

ఆ వివరాలు ఆసక్తికరంగా ఉన్నాయి. రావడానికోసారీ, తిరిగి వెళ్లడానికోసారీ టికెట్లు తీసుకోవడంకంటే, ఒక్కసారే ఏకంగా రానూపోనూ టికెట్లు తీసుకుంటే బాగా చవక ఔతుందిట. పెద్దవాళ్లకి మనిషికి పన్నెండొందల మార్కులు. 2–12 మధ్యవయసు పిల్లలకి ఒకొక్కరికి ఏడొందల యాభై మార్కులు. అంటే మొత్తం రెండువేల ఏడొందల మార్కులు. మావాళ్లు ఇండియాలో ఎక్కి నేరుగా బెర్లిన్‌లోనే దిగొచ్చు. టికెట్ బుక్ చెయ్యడానికి పది రోజులు ముందు చెబితే చాలుట.

"మరి నీ దగ్గర అంత డబ్బుందా?" అన్నాడు ఓంప్రకాష్ అనుమానంగా.

అతని అనుమానానికి కారణముంది. కొద్ది రోజులు ముందే ఓంప్రకాష్ కన్సెషన్ రేటుకి ఇప్పిస్తానంటే – నేరుగా బ్రౌన్ కంపెనీ షోరూంనుంచి మిక్సీ ఒకటి కొన్నాను. మిక్సీ కొనేటప్పుడు అతను, "ఇప్పటికే నువ్వు కాసెట్ టేపురికార్డరు, స్పూల్‌టైపు స్టీరియో టేపురికార్డరు కొన్నావు. ఇప్పుడు మిక్సీ. ఇలాంటివి నీవాళ్లొచ్చేక కొనచ్చు కదా! ప్రస్తుతం డబ్బు ఆదా చేస్తే సమయానికి అక్కరకొస్తుంది" అని హెచ్చరించాడు.

నేను బెర్లిన్ వచ్చి రెండు నెల్లే అయింది కాబట్టి ఈ నేపథ్యంలో అతడి అనుమానం సహజమే.

నిజానికి అప్పటికప్పుడు టికెట్లు కొనాలంటే నా దగ్గరున్నదంతా ఇచ్చేసినా ఇంకా రెండొందల మార్కులు తక్కువౌతాయి. కానీ ఆ మాట చెబితే – మళ్లీ ఏం సలహా ఇచ్చి నేను వెనకడుగు వేసేలా చేస్తాడోనని నా భయం.

"ఉంది" అన్నాను మేకపోతు గాంభీర్యంతో.

ఐతే నేను హోరుగాలిలో దీపం పెట్టి ఆ మాటనలేదు.

క్రిస్మస్ సందర్భంగా జనవరి నెలలో ఇవ్వాల్సిన స్టయిపెండ్ వెయ్యిమార్కులూ, ముందుగా డిసెంబర్ 17కే ఇచ్చేస్తామని చెప్పారు. అందులోంచి రెండొందల మార్కులు ఈ టికెట్లకోసం తీస్తే, జనవరి నెల ఇంటద్దెకి మరో రెండొందల మార్కులు పోగా – నాకు మిగిలేది ఆరొందల మార్కులు. నావాళ్లు జనవరికల్లా వచ్చేస్తే కనుక – మరి జనవరి నెలలో నాకిక స్టయిపెండ్ రాదు కాబట్టి – ఆరొందల మార్కులతో

ఆ నెల గడిపెయ్యాలి. అంతవరకూ ఇక్కడ నాకున్న అనుభవాన్ని బట్టి అది సాధ్యమేనని నా నమ్మకం. ఎటొచ్చీ డిసెంబర్ 17లోగా టికెట్లు కొనడం వీలుపడదు.

ఏదేమైనా కొంతకాలంపాటు జీవితం – మార్కులు, ఫెనిగ్సు లెక్కలతోనే సరిపోతుందనిపించింది. ఐనా మేం నలుగురం ఒకచోట కలిసుండే ఆనందంలో ఆ లెక్కలు కూడా ఓ మధురానుభూతి కావచ్చు.

ఐనా అలాంటి లెక్కలు మాకేం కొత్త కాదు. ఇండియాలో వచ్చే జీతంతో – తలిదండ్రులు, తమ్ముళ్ళు, చెల్లెళ్ల బాధ్యతలతో నెలకి మూడు నాలుగు సార్లు బడ్జెట్ మారుస్తుండే అనుభవం మాది. అదే ఇక్కడా కొనసాగుతుంది.

నేనిలా ఆలోచిస్తున్నాను. కానీ నా ఉత్తరం చేరేలోపునే అన్నయ్యనుంచి మరో ఉత్తరం వచ్చింది.

టికెట్లు జర్మనీలో కొనుక్కోవడమే మంచిదంటున్నారుట అంతా! అది సాధ్యమయ్యే మాటైతేనే పాస్‌పోర్టు తీసుకుంటాననీ, లేకుంటే పాస్‌పోర్టుకి అనవసరంగా డబ్బు దండగనీ వ్రాశాడు అన్నయ్య.

పాస్‌పోర్టుకయ్యే ఖర్చు మనిషికి వంద రూపాయల లోపు. పిల్లలిద్దరూ ఐదేళ్ల లోపువాళ్లు కాబట్టి వాళ్లకి వేరే పాస్‌పోర్టులుండవు. తల్లి పాస్‌పోర్టులో వాళ్ల ఫొటో, వివరాలు నమోదు చేస్తే చాలు. వేలకు వేలు పణంగా పెట్టనున్న జర్మనీ ప్రయాణంలో ఇంత చిన్న ఖర్చుకి ఎందుకి వెనుకాడుతున్నాడో అర్థం కాలేదు. కానీ ఇలాంటి విశేషాలు చర్చించుకుందుకు ఇప్పట్లాంటి ఫోన్ సదుపాయాలు లేవుకదా అప్పుడు?

ఖర్చుకి వెనుకాడొద్దనీ, అర్జంటుగా శ్రీమతికి పాస్‌పోర్టు ఏర్పాటు చెయ్యమనీ అన్నయ్యకి వెంటనే ఉత్తరం వ్రాసాను.

ఆ ఉత్తరం పోస్టు చేసేక – ఇక నావాళ్లు ఇక్కడికి రావడం ఖాయం అనిపించింది. వాళ్లొచ్చేక ఏంచెయ్యాలీ అన్న ఆలోచనలో పడ్డాను.

ముందుగా గుర్తొచ్చేది చలి. మావాళ్లు ఇక్కడి చలికి తట్టుకోగలరా? ముఖ్యంగా పిల్లలు....

ఐతే ఆ విషయంలో నేను ధైర్యంగానే ఉన్నాను. ఎందుకంటే –

అప్పుడప్పుడే బెర్లిన్లో వాతావరణం మారుతోంది. అక్టోబరు రాగానే ఇక్కడ అంతా చలికాలం వచ్చేసిందంటున్నారు.

ఊళ్లో చాలా ఇళ్లముందూ, షాపులముందూ వ్రేలాడుతుండే థర్మామీటర్ల ద్వారా ఎప్పటికప్పుడు నాకు టెంపరేచర్ తెలుస్తూనే ఉండేది. బయట టెంపరేచర్ పది డిగ్రీల లోపే ఉంటోంది. అప్పటికి రెండుసార్లు మంచు కురవడం చూశాను. ఒక రోజున టెంపరేచర్ బాగా పడిపోయి మైనస్ ఆరుకి చేరుకుంది. ఐతే అందరూ భయపెట్టినట్లు ఈ చలి నన్ను పులిలా వేటాడలేదు. కనీసం కోడిగ్రుడ్డయినా తినకుండా, చేతులకి గ్లోవ్స్ అయినా వేసుకోకుండా చాలా హాయిగా తిరుగుతున్నానీ చలిలో. అదో పెద్ద విశేషంలాగా అనిపించలేదు. ఎందుకంటే ధరించిన ఉన్ని బట్టలు వంటిని వెచ్చగా ఉంచుతున్నాయి.

బయటకెడితే రోడ్లమీద షికారు చెయ్యం కదా! వెడితే ఆఫీసుకి. లేదూ షాపులకో, మిత్రుల ఇళ్లకో.

ఇక్కడ ఆఫీసు వెచ్చన. షాపులు వెచ్చన. ఇళ్లు వెచ్చన. బస్సులు వెచ్చన. రైళ్లు వెచ్చన. రైల్వే స్టేషన్లు వెచ్చన. ఈ వెచ్చదనాలకి మధ్యలో చేసే రోడ్డు ప్రయాణం వ్యవధి ఎన్నడూ రెండు మూడు నిముషాలకు మించదు. ఆ సమయంలో చేతులు ఓవర్‌కోట్ జేబుల్లో ఉంటాయి. ముఖమొక్కటే చల్లబడుతుంది. ఆ కాసేపూ అది భరించడంలో ఇబ్బంది ఉండదని నా అనుభవం చెప్పింది. ఇంకా చెప్పాలంటే –

ఇండియాలో ఐతే అడపాతడపా నాకు రొంప పట్టేది. చలి తిరిగినప్పుడైతే జలుబు తప్పనిసరి. కానీ పరిసరాలు దుమ్మూ, ధూళీ లేకుండా పరిశుభ్రంగా ఉండడంవల్లనేమో, ఇంతవరకూ నేనిక్కడ జిర్రున చీదనైనా లేదు.

ఈ నేపథ్యం కారణంగా – నావాళ్లకిక్కడ కనీసం ఆరోగ్య విషయంలోనైనా ఏ సమస్యా ఉండదని నా నమ్మకం.

నా ఆలోచనలిలా అన్నివైపులా తిరుగుతుండగా – ఓంప్రకాష్ సరళ్సేన్‌ని వాకబు చేసి టికెట్లు జనవరి ఆరునుంచి పది మధ్యలో దొరకొచ్చునని తెలుసుకున్నాడు.

ఈలోగా శ్రీమతినుంచి ఇంకో ఉత్తరమొచ్చింది. అందులో తన ప్రయాణం టికెట్ గురించి అక్కడ జరుగుతున్న ప్రయత్నాల వివరాలున్నాయి.

అన్నయ్యకి నిత్యానందం అనే మిత్రుడున్నాడు. ఆయన ఇచ్చిన సమాచారం ప్రకారం ధర కాస్త ఎక్కువైనా ఎయిర్ ఇండియాలో టికెట్ కొంటే, వాయిదాల పద్ధతిమీద డబ్బు చెల్లించొచ్చుట. అందుకు బాధ్యత గల ఆఫీసరు హామీ పడాలిట. మరి అన్నయ్య ఐడిబిఐలో పెద్ద ఆఫీసరు కాబట్టి, హామీ సమస్య కాదు.

"నాకు తెలుసు. నేను జర్మనీ రావడానికే పదిహేను వేలవుతుంది. అయినా సరే, రావాలన్న ఆలోచన ఒకసారి నాలో మొదలయ్యేక – అది పెద్ద ఖర్చనిపించడం లేదు నాకు. మీరు మారాలోచించద్దు. ఇందుకు ఒప్పుకుంటూ వెంటనే ఉత్తరం రాయండి. ఇక్కడ అన్ని ఏర్పాట్లూ జరిగిపోతాయి" అని రాసింది తను.

ఆ ఉత్తరం చదువుతుంటే నా కళ్ళు చెమ్మగిల్లాయి. ఆడపడుచుల పెళ్ళిళ్ల బాధ్యత బరువుని గ్రహించినదై – తనకోసం ఏడాదికి రెండు మూడు చీరలకి మించి కొనుక్కోని మనస్తత్వం శ్రీమతిది. తనిప్పుడు ఒక్కసారిగా పదిహేను వేలు ఖర్చు చెయ్యలంటే, అదేం ఫరవాలేదనే మనఃస్థితికి వచ్చింది. అంటే తనిప్పుడు నన్ను ఎంతగా మిస్సవుతోందో ఊహించగలను. కలిసుంటే గంజన్నమైనా పరవాన్నమేనన్న సామెత ఊరికే రాలేదు.

శ్రీమతి ఉత్తరంలో హృదయాన్ని తాకే విశేషాలు చాలా ఉన్నాయి.

***( కొనసాగింపు వచ్చేనెలలో)***

Post your comments